క్లుప్తంగా

నేడు బీజేపీ 'ప్రజా ఆశీర్వాద యాత్ర'

బంట్వారం: బీజేపీ చేవెళ్ల పార్లమెంటు అభ్యర్థి కొండా విశ్వేశ్వర్ రెడ్డి చేపట్టిన ప్రజా ఆశీర్వాద యాత్రను విజయవంతం చేయాలని ఆ పార్టీ గీతాసెల్ జిల్లా అధ్యక్షుడు వెంకటేషం గౌడ్ గురువారం ఒక ప్రకటనలో కోరారు. శుక్రవారం ఉదయం ఆశీర్వాద యాత్ర బంట్వారం మండలం నుంచి ప్రారంభం అవుతుందని తెలిపారు. అదే విధంగా కోట్‌పల్లి, ధారూరు, మర్పల్లి మండలాల్లో యాత్ర కొనసాగుతుందని వెల్లడించారు. కార్యక్రమంలో పార్టీ శ్రేణులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

ఖురాన్ బహూకరణ


గ్రంథాన్ని బహూకరిస్తున్న ముస్లింలు

కొడంగల్: పట్టణంలోని మక్కామసీదులో తెలుగులో ముద్రించిన ఖురాన్‌ను పీఏసీఎస్ చైర్మన్ శివకుమార్ గుప్తా, సామాజిక కార్యకర్త మురహరి వశిష్ఠలకు బహూకరించారు. మాజీ ఉప సర్పంచ్ గౌసన్ ఆధ్వర్యంలో గ్రంథాన్ని అందజేశారు. అనంతరం సత్కరించారు. ఈ సందర్భంగా గుప్తా మాట్లాడారు. మసీదు కమిటీ సభ్యులు 16 ఏళ్లుగా రంజాన్ మాసంలో ఖురాన్‌ను బహూకరిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అబ్దుల్ ఖరీమ్ అశ్రఫీ, సయ్యద్ మునీర్, ఆసిఫ్‌ఖాన్, సయ్యద్ వాహెద్ రజా, సలీం, ఇసాక్ పాష, జావీద్, నిసార్ తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ

యాలాల: అనారోగ్యంతో బాధపడుతూ జుంటుపల్లి గ్రామానికి మాజీ వైస్ ఎంపీపీ రామారావు బుధవారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న బీఆర్‌ఎస్ నేతలు గురువారం రామారావు కుటుంబీకులను పరామర్శించారు. ఇందులో పార్టీ మండల అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, సొసైటీ వైస్ చైర్మన్ వడ్డే రాములు, జుంటుపల్లి, చెన్నారం మాజీ సర్పంచ్‌లు వెంకట్‌రెడ్డి, అరవింద్, నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, రఘురెడ్డి, శరణుభూపాల్ తదితరులు ఉన్నారు.

నియామకం



కొడంగల్: బీజేపీ కొడంగల్ పట్టణ అధ్యక్షుడిగా గంటి సర్వేశ్వర్‌ను ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు మాధవరెడ్డి గురువారం నియమించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కొడంగల్‌కు చెందిన సర్వేశ్వర్.. కొంత కాలంగా పార్టీలో ఒక కార్యకర్తగా చురుగ్గా పనిచేస్తున్నారని, అందుకే గంటిని ఈ పదవి వరించిందని పేర్కొన్నారు.

గడ్డివాము దగ్ధం


మంటలను ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

తాండూరు రూరల్: ప్రమాదవశాత్తు గడ్డివాము దగ్ధమైంది. ఈ సంఘటన మండల పరిధి కరన్‌కోట్‌లో గురువారం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన రైతు గౌరి శంకర్‌కు చెందిన గడ్డివాముకు మంటలు అంటుకున్నాయి. గమనించిన కొందరు రైతులు తాండూరు ఫైర్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వగా.. ఫైర్ సిబ్బంది మంటలను ఆర్పేశారు. కాగా.. ఎవరో కావాలనే గడ్డికి నిప్పుపెట్టారని బాధిత రైతు ఆరోపించారు.

బడికి ఆలస్యంగా వస్తే ఎలా?

పెద్దేముల్: 'ముందుగా రావాల్సిన మీరే వెనుక బడుతున్నారు. మిమ్మల్ని చూసి విద్యార్థులు అదే బాట పడతారు. ఇలా అయితే ఎలా' అని పాఠశాలకు ఆలస్యంగా వచ్చిన ఉపాధ్యాయులను గ్రామస్తులు ప్రశ్నించారు. మండల పరిధి ఇందూరు ప్రభుత్వ పాఠశాలకు చెందిన ఉపాధ్యాయ బృందం ఉదయం 8గంటలకు రావలసి ఉంది. కానీ గురువారం 8.20 గంటలు గడిచినా పూర్తిస్థాయిలో సిబ్బంది రాలేదు. దీంతో గ్రామానికి చెందిన బంద్యప్ప, విశ్వనాథం, అమీరొద్దీన్, నజీరొద్దీన్, ఫెరోజ్ తదితరులు హెచ్‌ఎం సంగమేశ్వర్, ఉర్దూ మీడియం హెచ్‌ఎం, ఉపాధ్యాయులను కలిసి మాట్లాడారు. 'ఆలస్యంగా వస్తే తప్పని చెప్పే మీరే.. బడికి లేటుగా వస్తే ఎలా' అని అడిగారు. ఇలా చేస్తే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయాల్సి ఉంటుందని చెప్పారు.


స్నేహ భావానికి ప్రతీక ఇఫ్తార్ విందు

షాబాద్: స్నేహ భావానికి ప్రతీకగా ఇఫ్తార్ విందులు దోహదపడతాయని కాంగ్రెస్ జిల్లా సీనియర్ నాయకులు జాకీర్‌షరీఫ్, మహ్మద్ ఫహీం అన్నారు. గురువారం ఎస్‌ఎన్‌సీ కన్వెన్షన్ హాల్‌లో ఖురేషి అదియాకచుదు (టీఎంఆర్‌ఈఐఎస్) ఆధ్వర్యంలో ఇఫ్తార్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రంజాన్ మాసం ఉపవాస దీక్షలో ఉండే ముస్లింల కోసం ఏర్పాటు చేసే ఇఫ్తార్ విందు, ఆత్మీయత మత సామరస్యానికి ప్రతీక అన్నారు. ఉపవాస దీక్షలు చేపట్టే ముస్లింలకు విరివిగా సహర్, ఇఫ్తార్ స్వచ్ఛందంగా ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. సర్వ మత సారం ఒక్కటేనని, మానవులంతా సోదరభావంతో ఉండాలన్నారు.

సారె తిప్పినా.. సాగని బతుకు

నష్టమైనా.. అదే జీవనాధారం

- కుమ్మరులకు కరువైన ప్రభుత్వ ఆదరణ
- ఏటా 8నెలలే కులవృత్తి


కుండల తయారీలో నిమగ్నమైన కుమ్మరి

బంట్వారం: కోట్‌పల్లి కుండలకు పెట్టింది పేరు. వీటికోసం చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలు ఇక్కడికి వచ్చి కొనుగోలు చేస్తుంటారు. అరకొర ఆదాయంతో వృత్తినే నమ్ముకొని జీవిస్తున్న కుమ్మరులకు ప్రభుత్వ ఆదరణ కరువైంది. అయినప్పటికీ వారు సారెను తిప్పుతూ.. బతుకు బండిని లాగిస్తున్నారు. నష్టమైనా సరే.. కుండలు తయారు చేస్తూ.. విక్రయిస్తున్నారు. కోట్‌పల్లి మండల కేంద్రంలో 30 కుటుంబాలకు కుల వృత్తే జీవనాధారం. వర్షా కాలం మినహా మిగతా 8 నెలలు పనిచేస్తుంటారు. దూరాన్ని బట్టి ఒక్కో ట్రాక్టర్ మట్టికి రూ.4 వేల నుంచి 5 వేలకు పైగా వెచ్చించి కొనుగోలు చేస్తుంటారు. గతంలో ఒక కుండలనే కాకుండా.. పొయ్యిలు, వంట పాత్రలను తయారు చేసేవారు. కుండలను గాడిదలపై వేసుకుని, చుట్టు పక్కల గ్రామాల్లో విక్రయించే వారు. ప్రస్తుతం ఆటోల్లో సంతకు తీసుకెళ్లి, అమ్ముతున్నారు. అవసరమైన వారు కోట్‌పల్లికి వచ్చి కుండలను కొనుగోలు చేస్తుంటారు.

తగ్గిన గిరాకీ

వేసవి వచ్చిందంటే పేద వాడి ఫ్రిజ్‌గా పిలువబడే మట్టి కుండలకు బలే గిరాకీ ఉండేది. ఇప్పుడు అలాంటి పరిస్థితి కనిపించడం లేదు. చల్లటి నీరు అనగానే రిఫ్రిజిరేటర్లు గుర్తుకు వస్తున్నాయి. మట్టి కుండలను ఇప్పటికీ అక్కడక్కడ వాడుతున్నారు. ఉగాది పచ్చడికి మాత్రం తప్పని సరిగా కొంటున్నారు. వచ్చిన ఆధాయంతోనే సరి పెట్టుకుంటున్నారు.

ప్రభుత్వం ఆదుకోవాలి



కుల వృత్తినే నమ్ముకున్నాం. ఇప్పటికీ ఇదే పనిని కొనసాగిస్తున్నాం. కుండలకు గిరాకీ తగ్గింది. లాభాలు లేక పోయినా.. సారె తిప్పుతున్నాం. ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆర్థిక సహాయం అందడం లేదు.

-వెంకటయ్య కోట్‌పల్లి

'జన జాతర'ను జయప్రదం చేయండి

ఎంపీపీ ముద్దప్ప దేశ్‌ముఖ్


మాట్లాడుతున్న ఎంపీపీ ముద్దప్ప దేశ్‌ముఖ్

కొడంగల్: జన జాతర బహిరంగ సభను విజయవంతం చేయాలని ఎంపీపీ ముద్దప్ప దేశ్‌ముఖ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నందారం ప్రశాంత్ పిలుపునిచ్చారు. గురువారం పట్టణంలోని రేవంత్ నివాసంలో నిర్వహించిన మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. ఈ నెల 6న సాయంత్రం నాలుగు గంటలకు హైదరాబాద్‌లోని తుక్కుగూడలో నిర్వహించనున్న జాతరకు పార్టీ శ్రేణులు తరలి రావాలని కోరారు. జరగనున్న లోక్‌సభ ఎన్నికల్లో తెలంగాణలో 14 ఎంపీ స్థానాలను గెలిపించడానికి ముఖ్యమంత్రి, పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రేవంత్ రెడ్డి కృషి చేస్తున్నారని, ఇందులో భాగంగా రేపటి సభలో పార్టీ మేనిఫెస్టోను ఆవిష్కరించనున్నారని తెలిపారు. పార్టీ కొడంగల్ నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి ఆదేశాల మేరకు కార్యకర్తలందరూ కలిసి కట్టుగా పని చేయాలని సూచించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ శివకుమార్ గుప్తా, మాజీ జెడ్పీటీసీ ఏన్గుల భాస్కర్, పీసీసీ సభ్యుడు మహ్మద్ యూసుఫ్, కాంగ్రెస్ యువజన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కృష్ణంరాజు, మున్సిపల్ కౌన్సిలర్ శంకర్ నాయక్, పార్టీ నాయకులు గోడల రాంరెడ్డి, చిట్లపల్లి వెంకట్‌రెడ్డి, ఆసిఫ్‌ఖాన్, తార్యానాయక్ తదితరులు పాల్గొన్నారు.

మైనార్టీల సంక్షేమానికి ప్రాధాన్యం

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్


మైనార్టీ నేతలతో ఎమ్మెల్యే శంకర్

షాద్‌నగర్: మైనార్టీల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేసిందని ఎమ్మెల్యే శంకర్ అన్నారు. రంజాన్, ఈద్ ఉల్ ఫితర్ నమాజ్ ఏర్పాట్లపై గురువారం ఎమ్మెల్యే మైనార్టీ నేతలతో చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రంజాన్ మాసం ముస్లింలకు ఎంతో పవిత్రమైందన్నారు. నెలరోజుల పాటు కఠోరమైన ఉపవాస దీక్షలు చేసి, అల్లాను ప్రసన్నం చేసుకుంటారని పేర్కొన్నారు. ఈ నెల 11న రంజాన్ సందర్భంగా జమీదులు, ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించేందుకు వేలాది మంది తరలివస్తుంటారని, వారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. అదే విధంగా ప్రార్థనా స్థలాల వద్ద మౌలిక సదుపాయాలు కల్పిస్తామన్నారు. మున్సిపాలిటీ తరఫున ప్రార్థనా స్థలాల వద్ద పారిశుద్ధ్యం, మంచి నీరు, విద్యుత్ తదితర సదుపాయాలు కలిప్తామని పేర్కొన్నారు. సమావేశంలో పీసీసీ సభ్యుడు బాబర్‌ఖాన్, సదర్ ఖాజీ సయ్యద్ ముక్తదీర్ అలీ, మన్సూర్ అలీఖాన్, సయ్యద్ ఖదీర్ తదితరులు పాల్గొన్నారు.

కష్టపడి చదివితే మంచి భవిష్యత్తు


అవగాహన కల్పిస్తున్న హెచ్‌ఎం చంద్రశేఖర్

కేశంపేట: విద్యార్థులు ఉన్నత లక్ష్యాన్ని నిర్దేశించుకొని చదవాలని, కష్టపడి చదివితే మంచి భవిష్యత్ ఉంటుందని కొత్తపేట జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం చంద్రశేఖర్ అన్నారు. ప్రధాన మంత్రి స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా (పీఎంశ్రీ) పథకానికి మండల పరిధిలోని కొత్తపేట జెడ్పీ ఉన్నత పాఠశాల ఎంపికైంది. ఇందులో భాగంగా గురువారం నిర్బన్ అర్గనైజేషన్ సభ్యుల సహకారంతో విద్యార్థులకు కెరియర్ గైడెన్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ.. పదో తరగతి తర్వాత విద్యార్థులకు చాలా అవకాశాలు ఉంటాయన్నారు. కష్టపడి చదివి మంచి ర్యాంకులు సాధిస్తే ఉచిత విద్యా అవకాశాలు పుష్కలంగా ఉంటాయని ఉన్నాయని ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనివాససాగర్, కృష్ణయ్య, అబ్దుల్‌బారీ, సాయి ప్రసాద్, సుజాత, శిరీష, నిర్బన్ ఆర్గనైజేషన్ సభ్యులు నగేంద్రపోలిశెట్టి, నరేశ్ పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక చింతనతో ప్రశాంతత


బీజేపీ నాయకులను సన్మానిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

చేవెళ్ల: ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందని నాయకులు అన్నారు. మండలంలోని అల్లవాడ అనుబంధ గ్రామమైన జాలగూడ గ్రామంలో నిర్మించిన ఆంజనేయస్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆలయం వద్ద ప్రత్యేక పూజలు, హోమాలు చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్, బీఆర్‌ఎస్, బీజేపీ, సీపీఐలకు చెందిన నాయకులు పాల్గొని పూజలు చేశారు. అనంతరం వారికి గ్రామ ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించి, ఆలయానికి సంబంధించిన ఫొటోలను బహూకరించారు. కార్యక్రమాల్లో బీజేపీ నాయకులు పాండురంగారెడ్డి, అనంత్‌రెడ్డి, ప్రవీణ్‌రెడ్డి, శ్రీనివాస్, శ్రీనివాస్‌రెడ్డి, అభిలాష్‌రెడ్డి, సీపీఐ నాయకులు కె.రామస్వామి, మక్బుల్, యాదగిరి, వడ్ల మంజుల, కాంగ్రెస్ నాయకులు పామెన భీంభరత్, శ్రీనివాస్‌గౌడ్, పాండు, డీవీఆర్, ఆగిరెడ్డి, ప్రతాప్‌రెడ్డి, శైలజ, సమత, కృష్ణారెడ్డి, జంగయ్య, తిరుపతిరెడ్డి తదితరులు ఉన్నారు. గ్రామ నాయకులు కృష్ణారెడ్డి, రాజు, అమరేందర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

కనుల పండువగా బొడ్రాయి ప్రతిష్ఠ

షాబాద్: ప్రతి అణువులో దేవుడు ఉండి మంచి మార్గాన్ని చూపిస్తాడని రుద్రారం మాజీ సర్పంచ్ బండ స్వర్ణలత, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు గుర్రాల విష్ణువర్ధన్ రెడ్డి అన్నారు. గురువారం రంగారెడ్డి జిల్లా మండల పరిధి రుద్రారంలో బొడ్రాయి, నవగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాలు హనుమాన్ ఆలయంలో నిర్వహించారు. వేదపండితులు మంత్రోచ్చారణల మధ్య విగ్రహాల ప్రతిష్ఠ అంగరంగ వైభవంగా జరిగింది. పూజా కార్యక్రమాల్లో భాగంగా కలశస్థాపన, అభిషేకం, హోమం నిర్వహించారు. ఉదయం నుంచి ఆలయంలో వేద పండితుల ఆధ్వర్యంలో గణపతి హోమం, పుణ్యహవాచనం, సామూహిక హోమాలు జరిగాయి. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత కలుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో సంజీవరెడ్డి, నర్సింహులు, సంపత్‌రెడ్డి, కృష్ణ, శేఖర్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, మధు, మాణిక్యం, ఉపేందర్‌రెడ్డి, శివకుమార్, బాలయ్య, రవి, గ్రామస్తులు ఉన్నారు.

అభ్యసన పుస్తకాల అందజేత

దౌల్తాబాద్: బలంపేట ఉన్నత పాఠశాల, గోకఫసల్‌వాద్ యూపీఎస్ పాఠశాల విద్యార్థులకు యుడబ్ల్యూహెచ్ సంస్థ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం బహుమతులు ప్రదానం చేశారు. ఒకటి, రెండు, మూడు తరగతుల వారికి తెలుగు, గణితం. ఇంగ్లిష్ అభ్యసన పుస్తకాలు అందజేశారు. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధులు మాట్లాడారు. అభ్యసన పుస్తకాల ద్వారా విద్యార్థులు కింది స్థాయి నుంచి నైపుణ్యం సాధిస్తారని పేర్కొన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు రాజు, విజయ్‌కుమార్, సంస్థ సభ్యులు నరేందర్ ఉన్నారు.

సిబ్బంది సమస్యలు పరిష్కరించండి


వినతిపత్రం అందజేస్తున్న ఉపాధ్యాయులు

కొడంగల్: పార్లమెంటు ఎన్నికల విధుల్లో పాల్గొంటున్న సిబ్బంది సమస్యలు పరిష్కరించాలని పలువురు ఉపాధ్యాయులు కోరారు. ఈ మేరకు గురువారం తహసీల్దార్ విజయ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం మాట్లాడారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే వారికి కనీస సౌకర్యాలు కల్పించాలన్నారు. ప్రభుత్వం నుంచి రావాల్సిన రెమ్యూనరేషన్‌ను సకాలంలో చెల్లించాలని, ఈ విధుల నుంచి గర్భిణులు, బాలింతలు, వృద్ధులు, దివ్యాంగులకు మినహాయింపు ఇవ్వాలని కోరారు. ఇందులో టీఎస్ యూటీఎఫ్ వికారాబాద్ జిల్లా బాధ్యులు ముత్యప్ప, ఆత్మలింగ తీర్థ, కొడంగల్ మండల కమిటీ అధ్యక్షుడు బసప్ప, ప్రధాన కార్యదర్శి అశోక్‌కుమార్, బొంరాస్‌పేట ప్రధాన కార్యదర్శి రాజశేఖర్, దౌల్తాబాద్ మండల బాధ్యులు బసంత్, నర్సింలు, దుద్యాల మండల కమిటీ అధ్యక్షుడు మల్లప్ప ఉన్నారు.

ఎరువుల దుకాణంలో తనిఖీ

తలకొండపల్లి: యాసంగిలో రైతులకు అవసరమైన ఎరువులను అందుబాటులో ఉంచుకోవాలని ఏఓ రాజు ఎరువుల దుకాణపు యజమానులకు సూచించారు. గురువారం మండల కేంద్రంలోని ఎరువుల దుకాణాల్లో ఆయన తనిఖీలు నిర్వహించారు. స్టాక్ నిల్వ తదితర రికార్డులను పరిశీలించారు. యూరియా, డీఏపీ, ఎంఏపీల కొరత లేకుండా అవసరం మేరకు రైతులకు అందుబాటులో ఉంచాలని, ఎమ్మార్పీ ధరలకే ఎరువు బస్తాలు అందజేయాలన్నారు.


కూలీలకు ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు అందజేస్తున్న ఆశలు

ఎండలతో కూలీలు జాగ్రత్త

కుల్కచర్ల: ఎండలో పనిచేస్తున్న ఉపాధిహామీ కూలీలు పలు జాగ్రత్తలు తీసుకోవాలని ఏపీఓ చంద్రశేఖర్ సూచించారు. గురువారం మండల పరిధి గోరిగడ్డతండాలో ఉపాధి పనులు చేస్తున్న కూలీలకు ఓఆర్‌ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రస్తుతం వేసవితాపం ఎక్కువగా ఉందని, కూలీలు తప్పనిసరిగా తలపై టోపి, టవల్ కప్పుకోవాలని చెప్పారు. అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటున్న వారు పనులకు హాజరుకారాదని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధి సిబ్బంది, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి రానీయొద్దు

- సమస్యలు ఉంటే పరిష్కరించండి..
- సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ కరుణ



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ కరుణ

బషీరాబాద్: ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేస్తేనే సమస్యలు పరిష్కారం అవుతాయని ఎంపీపీ కరుణ అన్నారు. వేసవి ఉన్నందున గ్రామాల్లో ఎక్కడా తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం ఎంపీపీ అధ్యక్షతన జరిగిన మండల సమావేశంలో ఎంపీటీసీలు, జీపీ కార్యదర్శులు, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలు సమస్యలపై ఎంపీపీ చర్చించారు. గతంలో ప్రారంభమైన తాగునీటికి సంబంధించిన పనులు ఉంటే పూర్తి చేయాలని అధికారులకు చెప్పారు. గ్రామాల్లో పశువుల నీటి తొట్లను ప్రతి రోజు నింపి ఉంచాలని, తాటునీటి ఎద్దడి వచ్చిందంటే వెంటనే అధికారుల దృష్టికి తీసుకురావాలని కార్యదర్శులను ఆదేశించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో రోగులకు సకాలంతో వైద్య సేవలు అందించాలని, బషీరాబాద్‌లో రాత్రి వేళలో వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత వైద్యాధికారులకు సూచించారు. కల్యాణలక్ష్మి, షాదీముబారక్ వంటి పథకాల్లో చిన్న చిన్న లోపాలున్నా.. మానవీయ కోణంలో పేదలకు అందేలా చూడాలని స్పష్టం చేశారు. జెడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీఓ రమేష్, వివిధ గ్రామాల, ఎంపీటీసీలు, మండల అధికారులు పాల్గొన్నారు.

ఎన్నికలప్పుడే జిల్లా గుర్తుకొస్తదా?

- కొండాపై కేటీఆర్ అనుచిత వ్యాఖ్యలు తగవు
- బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి రవీందర్


సమావేశంలో మాట్లాడుతున్న రవీందర్

పూడూరు: మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు ఎన్నికలప్పుడే వికారాబాద్ జిల్లా గుర్తుకు వస్తుందని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి కే రవీందర్ ఆరోపించారు. గురువారం ఆయన కంకల్‌లో మాట్లాడారు. బుధవారం వికారాబాద్‌లో జరిగిన బీఆర్‌ఎస్ కార్యకర్తల సమావేశంలో కేటీఆర్.. బీజేపీ ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేయడం సరైందికాదని హితవు పలికారు. కొండా తాతల నాటి నుంచి ప్రజాసేవలో ఉన్నారని గుర్తు చేశారు. బీఆర్‌ఎస్‌లో చేరిన ఆయన.. మీరు చేసిన అవినీతి అక్రమాలను సహించలేకనే పార్టీ మారారని కేటీఆర్‌ను ఉద్దేశించి విమర్శించారు. అవినీతి అక్రమాలు చేసిన బీఆర్‌ఎస్‌కు గత అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు తగిన బుద్ధి చెప్పారని పేర్కొన్నారు. ప్రజలు నరేంద్రమోదీ నాయకత్వాన్ని కోరుకుంటున్నారని, ఎవరు ఎన్ని కుట్రలు పన్నినా ప్రజలు బీజేపీకే పట్టం కడతారని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి రాఘవేందర్‌రెడ్డి, మండల కార్యవర్గ సభ్యులు మల్లేశ్, శక్తి కేంద్రం ఇన్‌చార్జి వెంకటయ్య, బూత్ అధ్యక్షుడు నవీన్ తదితరులు పాల్గొన్నారు.

లోక్‌సభ ఎన్నికల్లో సత్తా చాటుతాం


వాసుదేవ్‌కన్నకు కండువా కప్పుతున్న నర్సింహారెడ్డి తదితరులు

బీజేపీ శంకర్‌పల్లి మున్సిపల్ ఇన్‌చార్జి వాసుదేవ్‌కన్న

చేవెళ్ల: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో బీజేపీ ఇన్‌చార్జిల నియామకంలో భాగంగా శంకర్‌పల్లి మున్సిపాలిటీ ఇన్‌చార్జిగా వాసుదేవ్‌కన్నను నియమించారు. ఈ మేరకు గురువారం బీజేపీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి వాసుదేవ్‌కన్నకు నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వాసుదేవ్‌కన్న విలేకరులతో మాట్లాడుతూ.. తనపై ఎంతో నమ్మకంతో అప్పగించిన ఈ పదవీ బాధ్యతలను సక్రమంగా నిర్వహించి పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని చెప్పారు. శంకర్‌పల్లి మున్సిపాలిటీలో పార్టీని బలోపేతం చేసి ఈ లోక్‌సభ ఎన్నికల్లో మెజార్టీ ఓట్లు సాధించేందుకు పాటుపడుతానన్నారు. గతంలో ఎప్పుడూ లేని విధంగా పార్టీ బలోపేతం అవుతుందని చెప్పారు. ఈ ఎన్నికల్లో బీజేపీ సత్తా చాటుతామన్నారు. పార్టీ ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డిని గెలిపించి, మోదీకి కానుకగా అందిస్తామని ధీమా వ్యక్తం చేశారు.

దానగుణం అలవర్చుకోవాలి

షాద్‌నగర్: ప్రతి ఒక్కరూ దాన గుణాన్ని అలవర్చుకోవాలని మాజీ వైస్ ఎంపీపీ బసిరెడ్డి నరేందర్‌రెడ్డి అన్నారు. గురువారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని కంసాన్‌పల్లి గ్రామానికి చెందిన రవి కుమార్ వివాహానికి మాజీ వైస్ ఎంపీపీ బసిరెడ్డి నరేందర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ పద్మ దంపతులు పుస్తె, మెట్టెలను అందజేశారు. పేదలకు దానం చేయడం ద్వారా పుణ్యం లభిస్తుందని పేర్కొన్నారు.

శిథిల వంతెనలు.. అర చేతిలో ప్రాణాలు

- ధ్వంసమైన బ్రహ్మణపల్లి, పాలేపల్లి, గొడుగోనిపల్లి బ్రిడ్జీలు
- వానాకాలం వస్తే.. రాకపోకలు బంద్
- ఇబ్బంది పడుతున్న వాహనదారులు, రైతులు


బ్రహ్మణపల్లి వంతెనపై నుంచి కాకారవాణి ప్రాజెక్టు జల ప్రవాహం.. నిలిచిన రాకపోకలు (ఫైల్)

దోమ: దశాబ్దాల క్రితం నిర్మించిన వంతెనలు శిథిలావస్థకు చేరి, వాహనదారులు, రైతులను ఆందోళనకు గురిచేస్తున్నాయి. ఎప్పుడు కూలిపోయి, ఏం జరుగుతుందోనని భయాందోళన చెందుతున్నారు. వానాకాలం, అకాల వర్షాల నేపథ్యంలో వాగులు వంకలు పొంగిపొర్లుతాయని పేర్కొంటున్నారు. రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగి, ప్రాణాలు అరచేతిలో పెట్టకొని ప్రయాణిస్తుంటామని పలువురు వాపోయారు.

పట్టించుకోని అధికారులు..

దోమ మండల పరిధి బ్రహ్మణపల్లి, పాలేపల్లి, గొడుగోనిపల్లి గ్రామాల పరిధి రోడ్డు మార్గంలో వంతెనలు, కల్వర్టులు అనేకం ఉన్నాయి. అయితే ఎప్పుడో నిర్మించినవి కావడంతో అవి శిథిలావస్థకు చేరుకున్నాయి. భారీగా వర్షాలు కురిస్తే కూలిపోవడానికి సిద్ధంగా ఉన్నాయి. ఈ సందర్భంగా నిత్యం ఈ మార్గంలో ప్రయాణించే వాహనదారులు, ప్రయాణికులు, స్థానికులు మాట్లాడుతూ.. ప్రమాదకరంగా మారిన వంతెనలు, కల్వర్టుల గురించి సంబంధిత అధికారులకు తెలిసినా పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు.

ప్రమాదకరంగా గుంత

బ్రహ్మణపల్లి గ్రామ సమీపంలో ఉన్న వంతెనపై పెద్ద గుంత ఏర్పడింది. అటుగా ప్రయాణించే వారు గుంతలో పడి ప్రమాదానికి గురవుతున్నారు. అంతే కాకుండా భారీ వర్షం కురిస్తే.. వచ్చే వరదతో ఈ మార్గంగుండా రాకపోకలకు అంతరాయం కలుగుతుందని స్థానికులు తెలిపారు. గొడుగోనిపల్లి గ్రామ సమీపంలోని కల్వర్టు తెగిపోయి, ఇబ్బందిగా మారిందంటున్నారు. దోమ, పాలేపల్లి మధ్యలో ఉన్న వాగుపై ఉన్న వంతెన పాడైందని తెలిపారు. వానా కాలం రాకముందే సంబంధిత అధికారులు వంతెనలు, కల్వర్టుల నిర్మాణానికి తగిన చర్యలు తీసుకోవాలని బాధిత గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

చర్యలు చేపట్టాలి



శిథిలావస్థకు చేరిక వంతెనలు, కల్వర్టులకు మరమ్మతులు చేపట్టాలి. వీలు కాని పక్షంలో కొత్తగా నిర్మించాలి. వానాకాలం వస్తే బ్రిడ్జిలపై నుంచి వరద ప్రవహిస్తుంటుంది. దీంతో పూర్తిగా రాకపోకలు స్తంభించిపోతున్నాయి. ఆయా బ్రిడ్జీలు, కల్వర్టులను సంబంధిత అధికారులు పరిశీలించి, తగిన చర్యలు తీసుకోవాలి.

– రాఘవేందర్‌రెడ్డి, బ్రహ్మణపల్లి గ్రామం